తెలంగాణ ప్రభుత్వం

# వ్యవసాయ పాడి పంటలు

( VYAVASAYA PADIPANTALU )

సంపుటి-10 సంచిక-12 వ్యవసాయ శాఖ పేజీలు - 52 డిసెంబర్ - 2020



రాష్ట్ర రైతాంగానికి, ప్రజలకు,
వ్యవసాయశాఖ సిబ్బందికి

## క్రిస్మస్ శుభాకాంక్షలు

## నేలను సజీవంగా ఉంచుదాం..
## నేల జీవ వైవిధ్యాన్ని కాపాడుకుందాం..

# మట్టి ఆరోగ్యమే మన ఆరోగ్యం - ప్రపంచ మట్టి దినోత్సవం 5 డిసెంబర్,2020

డా.కె.శ్రీనివాస్, ప్రధాన శాస్త్రవేత్త, కేంద్రీయ మెట్ట వ్యవసాయ పరిశోధనా సంస్థ, హైదరాబాదు.
డా.ఎస్.శ్రీదేవి, ప్రిన్సిపాల్, వ్యవసాయ పాలిటెక్నిక్, తోర్నాల, సిద్దిపేటజిల్లా




భూగ్రహంపై నేలమీద నివసించే జీవకోటి మొత్తం మట్టినుండి పుట్టి మట్టిలోనే కలిసిపోతుంది అనడంలో అతిశయోక్తి లేదు. మట్టిని నిర్లక్ష్యం చేసిన నాగరికతలు అచిర కాలంలో మట్టిలో కలిసిపోయాయనేది చరిత్ర నేర్పిన పాఠం. అటువంటి మట్టి ఆరోగ్యాన్ని పరిరక్షించడంలో భాగంగా మనం ప్రతి ఏటా డిసెంబర్ 5వ తేదీని ప్రపంచ మట్టి దినోత్సవంగా జరుపుకుంటున్నాం.

**ప్రపంచమట్టిదినోత్సవం 2020 – ప్రాముఖ్యత, ఉద్దేశ్యం :** ఇలా మట్టికి సంబంధించి ప్రత్యేకంగా ఒక అంతర్జాతీయ దినోత్సవాన్ని జరపాలనే ఆలోచన 2002 లోనే మొదలైనప్పటికి, ప్రపంచ ఆహార సంస్థ జూన్ 2013 సమావేశం ఆమోదించి ప్రతిపాదన పంపగా 2013 డిసెంబర్‌లో ఐక్య రాజ్య సమితి జనరల్ అసెంబ్లీ డిసెంబర్ 5వ తేదీని 'ప్రపంచ మట్టి దినం'గాను, 2015ని 'అంతర్జాతీయ మట్టి సంవత్సరం'గాను తీర్మానించింది. ఆ విధంగా 2014 డిసెంబర్ 5వ తేదీన మొదటి ప్రపంచ మట్టి దినోత్సవం మొదలై, అప్పటినుండి ప్రతి సంవత్సరం నిర్వహిస్తున్నారు. దీనినే ప్రపంచ మృత్తిక దినోత్సవం, లేదా ప్రపంచ నేల దినోత్సవం అని కూడా వ్యవహరిస్తున్నాయి. ప్రపంచ మట్టి దినోత్సవానికి సంబంధించి ప్రతి ఏటా ఒక నేపథ్యాన్ని ఎన్నుకుంటారు, అలా ఈ ఏటి నేపథ్యం 'మట్టిని సజీవంగా ఉంచుదాం, మట్టిలోని జీవన వైవిధ్యాన్ని కాపాడదాం'.

భూగ్రహం మొత్తం జీవ వైవిధ్యంలో పావు భాగం మట్టిలోనే ఉందని అంచనా. ఒక్క గ్రాము ఆరోగ్యవంతమైన మట్టిలో ప్రపంచం మొత్తం లోని మనుషుల సంఖ్యకు మించినన్ని జీవాలు నివసిస్తాయి. అయితే ఈ జీవకోటిలో కేవలం ఒక శాతం జీవాలని మాత్రమే మనం గుర్తించాం, మిగతా 99 శాతం, వాటి కార్యకలాపాలు, మట్టిపై వాటి ప్రభావం గురించి మనకు ఏమాత్రం అవగాహన లేదు. మట్టిలోని ప్రాణికోటి సమస్తం ఆరోగ్యంగా ఉంటేనే మట్టి సజీవంగా ఉండి నిర్దేశిత సేవలు అందించగలుగుతుంది. మట్టిలో నివసించే జీవరాశి నుండి మానవాళికి అత్యంత విలువైన పలు ఆంటీబయోటిక్స్ లభిస్తున్నాయి. ఆ విధంగా మట్టిని ప్రకృతి సిద్ధ ఔషధ భాండాగారంగా పరిగణించవచ్చు.

**మనవంతు బాధ్యతగా :** సజీవం, ఆరోగ్యవంతమైన మట్టి గల నేలలు ఆరోగ్యవంతమైన పంటలను ఇవ్వడమే కాక అనేక రకాలైన ఘన, ద్రవ, వాయు కాలుష్యాలను, వ్యర్థాలను సంగ్రహించి వాటిలోని హానికారక అంశాలను తొలగించి సురక్షితం చేస్తాయి, భూమిపై కర్బనం, నత్రజని వంటి పదార్థాల సహజ జీవిత చక్రాలను నియంత్రిస్తాయి, అంతే కాక వాతావరణ మార్పును నిరోధించడంలో కీలక పాత్ర పోషిస్తాయి. మట్టిలోని జీవరాశి నశిస్తే భూమిపై వ్యర్థాలు పేరుకు పోయి భూగ్రహం నివాస యోగ్యత కోల్పోతుంది.

అశాస్త్రీయమైన వ్యవసాయ పద్ధతులు, నియంత్రణ లేని పట్టణీకరణ, విచ్చలవిడి కాలుష్య పదార్థాల వెలువరింపు, అటవీ నిర్మూలన వంటి చర్యలు మట్టిని నిర్జీవంగా, నిస్సారంగా మారుస్తాయి. ఇటువంటి చర్యలను అదుపులో పెట్టి, మట్టిని పరిరక్షించులేక పోయినట్లయితే జీవకోటి మనుగడకే ప్రమాదం కలిగే పరిస్థితి వచ్చే అవకాశం ఉంది. ఈ దిశగా ప్రజలందరికీ అవగాహన కల్పించడం కోసమే ప్రపంచ మట్టి దినోత్సవం నిర్దేశించబడింది. కాబట్టి మానవులందరూ మట్టి విలువని, మట్టి ఆరోగ్యాన్ని కాపాడావలసిన అవసరాన్ని గుర్తించి ఆ దిశగా తగిన చర్యలు చేపడతారని ఆశిద్దాం.